


12న 'కో-ఆపరేటివ్' బ్యాంక్ కుటుంబాలతో 'గంగమ్మ'కు సారె

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)



తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లో అన్ని రకాల రుణాలను తీసుకున్న బ్యాంక్ ఖాతాదారులు సకాలంలో చెల్లించి రెగ్యులర్‌గా చేసుకోవాలని, ఇందులో వైసిపి పేరును వాడుకోవద్దని ఆ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి వెల్లడించారు. ఈనెల 12న తమ బ్యాంకు డైరెక్టర్ల కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మకు సారెను సమర్పించనున్నట్లు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ వాసుయాదవ్, డైరెక్టర్లు వేమూరి జ్యోతి ప్రకాష్, నాదమునిరెడ్డి, వెంకటేష్, సురేష్, దొరబాబు, అనీల్‌రాయల్, అమరనాథ్‌రెడ్డి, పాఠం చంద్ర పాల్గొన్నారు.

గిరిజనులకు గూడు కలేనా..!



గిరిజనులు కాపురాలు ఉంటున్న గుడిసెలు

ప్రజాశక్తి-బాలాయపల్లి

అందరూ నిరక్షరాస్యులు. చెమటోడ్చడం వారి నైజం. చేపల వేటకు వెళ్లడం.. రైతుల పొలాల్లో కూలీ పనులకు వెళ్లడం వారి వృత్తి. మట్టి పనుల్లో అందివేసిన చేతులు అవి. సుమారు 50 ఏళ్ల నుంచి మూడు తరాల వారికి అక్కడే స్థిర నివాసం. పూరిగుడిసెలే వారి ఆస్తి. ఇదీ బాలాయపల్లి మండలం వెంకటాపురం పంచాయతీ అక్కంపేట కాలువ పక్కన నివాసం ఉంటున్న గిరిజనుల పరిస్థితి. చిన్నపాటి వర్షం వస్తే గుడిసెల్లోకి నీళ్లు రావడంతో పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో తలదాచుకోవాల్సిన పరిస్థితి. 9 కుటుంబాల గిరిజనులు ఈగ్రామంలో మూడు తరాలుగా నివాసం ఉంటున్నారు. పక్కాగృహాలు మంజూరు చేయాలని 2011 నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెలు కప్పుకొని జీవనం సాగిస్తూ ఇప్పటికీ నానా అవస్థలు పడుతున్నారు. అయితే నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

దక్కని ప్రభుత్వ ఫలాలు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు వీరికి దక్కడంలేదు. పక్కా గృహాలు వీరికి మంజూరు కాలేదు. ఎటువంటి వైద్య సేవలు అందడం లేదు. పంచాయతీ అధికారులు బెదిరిస్తున్నారు. సచివాలయం సిబ్బంది దక్షిణ తమ సమస్యలను తీసుకెళ్లినా నవ్వడం, బెదిరించడంతోపాటు హేళనగా ప్రవర్తిస్తున్నారని గిరిజనులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మానసిక వికలత్వం 90 శాతం ఉన్నా.. రూ.3 వేల పింఛను ఇవ్వడం దారుణం. గ్రామంలో గిరిజనులకు ఆరోగ్య సమస్యలు అధికంగా ఉన్నాయి.

గిరిజన సంక్షేమ పథకాలెక్కడ..?

తరాలు మారినా యుగాలు మారిన తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం అక్కంపేట గిరిజన బతుకులు మారడం లేదు. గిరిజన సంక్షేమ పథకాలు వారికి సక్రమంగా అందడం లేదు. గిరిజనుల సంక్షేమ పథకాలు కేవలం పేపర్లలో ప్రకటనలుగానే మిగిలిపోతున్నాయి. అందరూ నిరక్షరాస్యులైనా గిరిజన సంక్షేమ అధికారులు కనీసం వారివైపు చూడటం లేదు. కనీస వసతులు కల్పించడంలోనూ నిర్లక్ష్యం చూపుతున్నారు.

మూడు తరాలుగా తిరుగుతున్నారు

ఎలాంటి జీవనాధారం లేదు. కూలీ పనులకు వెళ్లనిదే పూట గడవదు. వ్యవసాయ భూమి కోసం మూడు తరాలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. తాతల కాలం నుంచి ఇక్కడే జీవిస్తున్నారు. సాగు భూమి కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు కనికరించలేదు. పూరి గుడిసెల్లో ఉంటూ రైతుల పొలాల్లో కూలీ పనులకు వెళుతున్నారు. కూలీ పనులతోనే జీవనం సాగిస్తున్నారు.

- పూరిగుడిసెల్లోనే జీవనం
- రాత్రుల్లో విషపురుగులతో భయం
- మోకాళ్లోతు నీళ్లతో కష్టాలు
- పక్కాగృహాల కోసం ఎదురుచూపులు

పూరి గుడిసెలే దిక్కు



అయ్యా.. నేను వితంతురాలిని. 20 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు ఆడపిల్లలు, పూరిగుడిసెలో కాపురం ఉంటున్నాం. చిన్నపాటి వర్షం వస్తే ఆడపిల్లలు తీసుకొని పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలోకి వెళ్లి ఉండాల్సి వస్తుంది.

- చంద్ర రాజేశ్వరి, అక్కంపేట గిరిజన కాలనీ

పక్కా ఇళ్ల కోసం ప్రదక్షిణలు



పక్కా ఇళ్ల కోసం గత 15 ఏళ్ల నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. అధికారులు మాగోడు పట్టించుకోవడం లేదు. పూరిగుడిసెల్లో ఉంటున్నాం. పక్కా గృహాలు ఇవ్వాలని అధికారులకు అర్జీ పెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి ఇళ్లు మంజూరు చేయాలి.

- నల్లగోండ్ల విజేత, అక్కంపేట గిరిజనకాలనీ

వసతులు కరువు



మాకు కనీస మౌలిక వసతులు లేవు. వీధులు లేవు. వీధిలైట్లు వెలగడం లేదు. రాత్రిపూట ముళ్లపొదల నుంచి విషపాములు వస్తున్నాయి. చినుకు పడితే బురద. చాలా అవస్థలు పడుతున్నాం.

- శ్రీరామ్ వాణి, అక్కంపేట గిరిజన కాలనీ

'ఐసర్' వలస కార్మికులకు భద్రత కల్పించండి: సిఐటియు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఐసర్(ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్)లో పనిచేస్తున్న భవన నిర్మాణ రంగ వలస కార్మికులకు అన్ని రకాలుగా భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. ఐసర్ కార్మికుల పట్ల డీఈసీ కంపెనీ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సీఐటీయూ నాయకులు సోమవారం ఆర్డీవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పుల్లయ్య మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఐసర్ వద్ద డిఇసి కంపెనీ ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మందికి పైగా ఒరిస్సా, మధ్యప్రదేశ్, బీహార్, చండీఘర్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన భవన నిర్మాణ రంగ వలస కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. అయితే కార్మికుల వివరాలు రెవెన్యూ అధికారుల వద్ద గానీ, అటు లేబర్ కార్యాలయంలో గానీ లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. వలస కార్మిక చట్టం ప్రకారం కార్మికులకు మౌలిక వసతులతో కూడిన నివాస ప్రాంతం, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. కార్మికులను రేకుల షెడ్లలో నిర్బంధించి సదరు కంపెనీ కాంట్రాక్టర్ వెట్టిచాకిరి చేయించుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల కొట్టం కన్నా దారుణంగా కార్మికుల నివాస ప్రాంతం ఉందన్నారు. కనీసం మరుగు లేక కాలకత్యాలు సైతం బహిరంగంగానే నిర్వహించుకోవాల్సిన దుస్థితి అక్కడ ఏర్పడిందని చెప్పారు. కార్మికులకు కనీసం పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కూడా కంపెనీ కల్పించలేదని మండిపడ్డారు. కార్మికులకు సుస్తి చేసినా, ప్రమాదవశాత్తు మతి చెందినా విషయం బయటకు పోకుండా సెక్యూరిటీ సాయంతో నిర్బంధించి మరీ పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, అదనపు పనిగంటలు వలస కార్మికుల చేత చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఐసర్ వద్ద కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి వారికి అన్ని రకాలుగా భద్రత కల్పించాలని కోరారు. స్పందించిన ఆర్డీవో వలస కార్మికులకు అన్ని రకాలుగా హామీ ఇచ్చారు. సీఐటీయూ నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణి, కుమార్, రాజా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి- తిరుపతి

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 615 వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని అన్నమయ్య కళాక్షేత్ర ఆశ్రమ పీఠాధిపతి విజయ శంకర్ స్వామీజీ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తిరుపతి బిటిఆర్ కాలనీ లో ఏర్పాటైన అన్నమయ్య ఆశ్రమంలో మే 9 మంగళవారం నుంచి పది రోజులు పాటు జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 60 ఏళ్ల క్రితమే సాంఘిక అసమానతలపై భక్తి ఉద్యమంతో చీల్చి చండాడిన ఆ మహనీయుని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు. శ్రీవారిపై అచంచల భక్తితో 32వేల సంకీర్తనలు రచించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్యకు అటు ప్రభుత్వం, ఇటు టిటిడి నుంచి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదని వాపోయారు. తిరుమల కొండపై అన్నమయ్య ఇంటిని, పూజా మందిరాన్ని పునర్ నిర్మించాలంటూ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు పదివేల కిలోమీటర్లు పర్యటించి 12 లక్షల మంది నుంచి సంతకాలను సేకరించామన్నారు. అన్నమయ్య గృహసాధన కోసం తాము విస్తృత ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే తిరుమలలో పర్యటించే జానపద వత్తి కళాకారులు భజన అనంతరం మంగళం, బి టి ఆర్ కాలనీ అన్నమయ్య ఆశ్రమంలో సేదతీరేందుకు "అందరి ఇల్లు" విడిది కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఉద్ఘాటించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్నమయ్య ఆశ్రమం పేరుతో అనేక ధార్మిక, భక్తి, సామాజిక, సేవా కార్యక్రమాలను విస్తతం చేయనున్నట్లు ప్రకటించారు. ఈ పది రోజులపాటు జరగనున్న అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జయంతోత్సవాలకు వేలాదిగా భజన కళాకారులు, భక్తులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్థానిక అన్నమయ్య సర్కిల్ నందు (అల్ ఇండియా రేడియో వెనకాల) వున్న ప్రభుత్వ గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయం తిరుపతి నందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిస్టాత్మకంగా గ్రంథాలయాలలో చేపట్టిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనార్ మధుబాల సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ శిబిరం నందు 6 నుండి 10వ తరగతులు చదువుచున్న విద్యార్థులకు యోగ, మెడిటేషన్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రామా, నాటికలు, ఇంగ్లిష్ గ్రామర్, చెస్, క్యారమ్స్ , సంగీతం ఇతర అంశాలపై ఉచితముగా శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ అంశాలకు బయట కోచింగ్ తీసుకుంటే దాదాపుగా రెండు నుంచి మూడు వేల రూపాయలు తీసుకుంటారని, కానీ గ్రంథాలయం నందు ఉచితముగా శిక్షణ ఇస్తారని చెప్పారు. కావున పిల్లలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యస్.వి.యు రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.గోపాల్ మాట్లాడుతూ పిల్లల మనోవికాసానికి ఈ శిక్షణ ఉపయోగ పడుతుందని తెలిపారు. ఇంపాక్ట్ మోటివేషనల్ ట్రైనర్ నడ్డినారాయణ, లైబ్రేరియన్ జె.శివప్రసాద్, పి.గంగయ్య, డాక్టర్ కడవీటి మునిరత్నం (కవి), సురేంద్రారెడ్డి, తహాసున్నీసా బేగం పాల్గొన్నారు.

23 వరకు 'జాతీయ విపత్తు'లపై అవగాహన సదస్సులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, పదవ బెటాలియన్, విజయవాడ వారు నిర్వహించే విపత్తులపై అవగాహన కార్యక్రమాలలో ప్రజలు, యువత విరివిగా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి అన్నారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతూ ఈనెల మే 8 నుండి మే23 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాలలోని కళాశాలలు, పాఠశాలల్లో, గ్రామాలలో, స్థానిక సంస్థలలో వరదలు వచ్చే అవకాశం ఉన్న లోతట్టు ప్రాంతాలు, తుఫాను తరచూ ఏర్పడే ప్రాంతాలలో విపత్తు సంభవించినప్పుడు, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, ప్రమాదకరమైన పరిశ్రమలలో ప్రమాదాలు జరిగినప్పుడు విపత్తు నిర్వహణ బందాలు రాక ముందు స్థానికంగా తీసుకోవలసిన ముందు జాగ్రత్తల చర్యలపై ప్రజలలో సామాజిక స్పృహ, అవగాహన కల్పించుట కొరకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తమను తాము రక్షించుకుంటూ ఇతరులను కాపాడే దిశలో వారికి ప్రాణ, ఆస్తి, పశుసంపద నష్టం జరగకుండా వారి వద్ద అందుబాటులో ఉన్న పరికరాలను వినియోగించి వారి ఆత్మరక్షణతో పాటు ఇతరులను రక్షించే దిశలో విపత్తు నిర్వహణ దళాలు రాకముందు తీసుకునే చర్యలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించే తేదీలు, ప్రాంతాలపై విస్తత ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. రెవెన్యూ అధికారి శ్రీనివాస రావు, అగ్నిమాపక అధికారి రమణయ్య, ట్రాఫిక్ డిఎస్పి నర్సప్ప పాల్గొన్నారు.

జగనన్న 'సంక్షేమ' క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు అందేలా తగిన చర్యలు తీసుకోవాలనికలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ రూపొందించిన " జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023-24" ను సోమవారం కలెక్టరేట్ లోని స్పందన హాల్ లో ఆవిష్కరించారు. సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణలో డిఆర్ ఓ శ్రీనివాస రావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఏ బాల కొండయ్య, డిపిఆర్ఓ విజయ సింహా రెడ్డి, ఏపీఓ వెంకట రమణ, ఎస్డిసి లు కోదండరామిరెడ్డి భాస్కర్ నాయుడు శ్రీనివాసులు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలన్నీ పొందుపరచడంపై కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు.





జూన్ 10 నుంచి బిజినెస్ ఎక్స్పో

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి జూనియర్ ఛాంబర్ ఆధ్వర్యంలో జూన్ 10, 11 తేదీలలో స్థానిక శిల్పారామం ఏసి ఫంక్షన్ హాల్‌లో బిజినెస్ ఎక్స్పో 2023 నిర్వహించనున్నట్లు జెసిఐ అధ్యక్షులు గుణశేఖర్ తెలిపారు. ఈ ఎక్స్పోకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం జరిగిన కార్యక్రమంలో డాక్టరు వై.ప్రవీణ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బిజినెస్ ఎక్స్పోలో వ్యాపారస్తులు వారి ఉత్పత్తులు, సేవలను తిరుపతి ప్రజల ముందు ప్రదర్శిస్తారన్నారు. ఇందులో రియల్ ఎ స్టేట్, కన్స్ట్రక్షన్, ఆటో మొబైల్, హాస్పిటల్, వస్త్ర, ఆహార, ఆటలు, బ్యాంకింగ్, అలంకార, ఇతర రంగాలకు చెందిన 81 స్టాల్స్ అందుబాటులో ఉంటాయన్నారు. దీన్ని తిరుపతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎస్ బాబు, జి.శంకర్, దొరస్వామిరాజు, శేషసాయి, చైతన్యతేజ్, వినయ్, నామా రాజేష్ పాల్గొన్నారు.

'పాలిసెట్'కు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 10న నిర్వహించే పాలిసెట్ 2023 ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని జిల్లా కోఆర్డినేటర్ డాక్టరు వై.ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10వ తేది ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. 10 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామని, 9 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు, బ్యాగులు, పరుసులు ఇతర సామాగ్రిని అనుమతించమన్నారు. నిమిషం ఆలస్యమైన అనుమతి ఉండదని స్పష్టం చేశారు. తిరుపతి, గూడూరులో 16 కేంద్రాల్లో4957 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థి హాల్‌టికెట్, ఆధార్‌కార్డు ఒరిజనల్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

అర్జీలను పరిష్కరించడంలో ప్రత్యేక దృష్టి : కలెక్టర్

తిరుపతిటౌన్ : 'స్పందన'లో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాల వ్యవధి లోపల ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలకు అర్థవంతంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటరమణా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లో నిర్వహించిన స్పందన కార్యక్రమలో డి ఆర్ ఓ శ్రీనివాసరావు తో కలసికలెక్టర్ స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు ఎస్ డి సి లు కోదండ రామిరెడ్డి, భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ ఉన్నారు. మొత్తం 153 వినతులు వచ్చాయని, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 107 ఉన్నాయని తెలిపారు.

శ్రీవారి ఆలయంలో వీడియో చిత్రీకరణపై చర్యలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల ఆనంద నిలయం దశ్యాలను తన మొబైల్ లో చిత్రీకరించడం తాజాగా సంచలనం సష్టిస్తోంది. ఓ భక్తుడు ఆలయం ఆవరణలోకి సెల్ ఫోన్ తో ప్రవేశించాడు. ఆనంద నిలయం దశ్యాలను తన మొబైల్ లో వీడియో తీశాడు. తర్వాత ఆ దశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే తిరుమలలో అత్యంత కఠినంగా తనిఖీలు నిర్వహిస్తారు. దాదాపు మూడు ప్రాంతాల్లో ఈ తనిఖీలు ఉంటాయి. అంతటి నిఘాలో సదరు భక్తుడు సెల్ ఫోన్ తీసుకురావడంపై తిరుమల మరోసారి భద్రతా వైఫల్యం బయటపడింది. దీంతో టీటీడీపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై టీటీడీ విజిలెన్స్ అధికారి బాలిరెడ్డి స్పందించారు. సీసీ కెమెరాలను పరిశీలించి అసలు విషయం తెలుసుకుంటామన్నారు. తిరుమల ఆనంద నిలయం దశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ నరసింహ కిషోర్ వెల్లడించారు. టీటీడీ నిబంధనల ప్రకారం శ్రీవారి ఆలయంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లడం, వీడియో చిత్రీకరించడం చట్టరీత్యా నేరం అనే విషయం భక్తులందరికీ తెలుసనన్నారు. 'ఆదివారం రాత్రి తిరుమలలో ఉరుములతో కూడిన భారీ వర్షం కురవడంతో దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో సదరు భక్తుడు పెన్ కెమెరాతో లోపలికి తీసుకెళ్లి వీడియో చిత్రీకరించినట్లు అనుమానిస్తున్నారు. అయినా ఇలా జరగడం బాధాకరం. సీసీటీవీల ద్వారా భక్తుడిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటాం. టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆదేశాల మేరకు ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం' ఆయన తెలిపారు.

చెరువుకు ట్రెంచ్ ఏర్పాటు

తిరుపతి(మంగళం):మంగళం పరిధిలోని చెన్నాయిగుంట చెరువు భూమి ఆక్రమణలకు గురికాకుండా తిరుపతి అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ ఆదేశాలతో విఆర్వోలు భూపతిఆచారి, సుమన్ సోమవారం ట్రెంచ్ ఏర్పాటు చేశారు. విఆర్వోలు మాట్లాడుతూ చెన్నాయిగుంట చెరువు భూమిని ఆక్రమణకు గురికాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ట్రెంచ్ ఏర్పాటు చేశామని, ఎవరైనా అతిక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



దాస్యభక్తికి ప్రతీక హనుమంతుడు

ఆచార్య సర్వోత్తమరావు

తిరుపతి సిటి : నవవిధ భక్తి మార్గాల్లో ఒకటైన దాస్యభక్తికి ప్రతీక హనుమంతుడని ఎస్వీయు తెలుగు విశ్రాంతాచార్యులు ఆచార్య కె.సర్వోత్తమరావు అన్నారు. హనుమంతుని వైభవాన్ని తెలియజేస్తూ అన్నమయ్య రచించిన పలు సంకీర్తనలు ప్రాచుర్యం పొందాయన్నారు .తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 615వ జయంతి ఉత్సవాలు సోమవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆచార్య సర్వోత్తమరావు "అన్నమయ్య - హనుమత్ కీర్తనలు" అనే అంశంపై ఉపన్యసించారు. తిరుమలలోని అంజనాద్రిలోనే హనుమంతుడు జన్మించారని చెప్పేందుకు బలమైన ఆధారాలు ఉన్నాయన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు డా. నల్లన్న 'అన్నమయ్య - గ్రామీణ జీవనం' అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య తన సంకీర్తనల్లో గ్రామీణ జీవితంలోని మాధుర్యాన్ని, జానపదాలను, గ్రామాల్లోని సామెతలను, నానుడులను పొందుపరిచారని తెలియజేశారు. సహాయ ఆచార్యులు డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ "అన్నమయ్య - పౌరాణికత" అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

బొజ్జల ప్రథమ వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



రాష్ట్ర మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి, ఆయన సోదరుడు బొజ్జల హరినాథరెడ్డి ప్రథమ వర్ధంతి వేడుకలు సోమవారం వారి స్వగ్రామం ఊరందూరులో జరిగాయి. ఈ వర్ధంతిలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, ఆమె భర్త పనబాక కష్ణయ్య, తిరుపతి మాజీ శాసనసభ్యులు సుగుణమ్మ, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడు, సత్రవాడ మునిరామయ్య, బీజేపీ నేతలు సైకం జయచంద్రారెడ్డి, కోలా ఆనంద్ తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అదేవిధంగా శ్రీకాళహస్తి, సత్యవేడు, తిరుపతి, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి వందలాదిగా అభిమానులు తరలి వచ్చారు. మొదట బొజ్జల బందమ్మ, బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, బొజ్జల సురేష్ రెడ్డి తదితర కుటుంబ సభ్యులు ఉదయం 9గంటల ప్రాంతంలో బొజ్జల గోపాలకష్ణారెడ్డి, బొజ్జల హరినాథరెడ్డి సమాధుల వద్దకు వెళ్లి సాంప్రదాయ బద్ధంగా నివాళులు అర్పించారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీనాయుడు, సత్రవాడ మునిరామయ్య, బీజేపీ నేతలు సైకం జయచంద్రారెడ్డి, కోలా ఆనంద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు,దసరాద ఆచారి, గురువారెడ్డి,ఉన్నం వాసుదేవనాయుడు, బర్రె హేమభూషణరెడ్డి, సిద్దగుంట సుధాకర్ రెడ్డి, ధనుంజయ నాయుడు, శివశంకరరెడ్డి, తాటిపర్తి ఈశ్వరరెడ్డి తదితర ప్రముఖులు టీడీపీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. బొజ్జల గోపాలకష్ణారెడ్డి, బొజ్జల హరినాథరెడ్డి సేవలను, గొప్పతనాన్ని వారు గుర్తు చేసుకున్నారు.

రాజకీయ ప్రాధాన్యతకు కృషి చేయాలి




ప్రజాశక్తి-గూడూరు రూరల్: రాష్ట్రంలోని ఎస్సీ రిజర్వ్డ్ నియోజకవర్గాల్లో మాదిగలకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించేందుకు సంఘటితంగా కృషి చేయాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం పిలుపునిచ్చారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పరిశపోగు శ్రీనివాసరావు పిలుపు మేరకు గూడూరు రూరల్ మండలం కొండాగుంట గ్రామంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం, రాష్ట్ర సలహాదారు చిగురుపాటి పవన్ కుమార్ ఆధ్వర్యంలో మాదిగల మేలుకొలుపు గ్రామసభను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో మాదిగల మేలుకొలుపు గ్రామసభలు నిర్వహించి నూతన కమిటీలు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టామని ఆదూరు రత్నం పేర్కొన్నారు. అనంతరం నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కొండాగుంట గ్రామకమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీలో తాళ్లూరు పవన్‌కుమార్, గూటూరు బాలి పెంచలయ్య, పాలిచర్ల భాస్కర్, కోతిపాక శివమణి, పాలిచర్ల మహేష్, కోతిపాక శీనులను ఎన్నుకున్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రయాణికులు, పేదల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించారు. సోమవారం స్వచ్ఛాంధ్ర ఛైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ మరుగుదొడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఆర్డీవో కిరణ్ కుమార్, కమిషనర్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లిని కలిసిన విజయకుమార్



ప్రజాశక్తి-గూడూరు టౌన్ : గూడూరు వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్ సోమవారం వాకాడులోని నేదురుమల్లి స్వగృహంలో తిరుపతి జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గంలోని పలు విషయాలపై చర్చించారు. పార్టీ లో కష్టపడిన వారికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు కృషిచేయాలని ఆయన సూచించారు.

నేటి నుంచి సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈనెల 9 నుంచి సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ప్రారంభిస్తున్నట్లు కమిటీ సభ్యులు మునిగిరీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి క్లబ్, కనుమూరు హరిశ్చంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 15 సంవత్సరాలలోపు ఆసక్తి ఉన్న పిల్లలు నమోదు చేసుకోవాలని కోరారు. సమావేశంలో సురేంద్రరెడ్డి , లవ కుమార్, విజయ్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సి.ఆర్.రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: ప్రముఖ వైద్యుడు డాక్టర్ సి.ఆర్. రెడ్డి ఇటీవల మరణించడంతో తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణిలను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దాయన సీఆర్ రెడ్డి ఎంతోమంది పేద ప్రజలకు తక్కువ ఖర్చుతోనే సేవలు చేశాడని, ఆయన మతి చాలా బాధాకరమని తెలిపారు. ఆయన వెంట ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ , గూడూరు శ్రీనివాసులురెడ్డి, గూడూరు ఎంపీపీ బూధూరు గురవయ్య, వైసీపీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, వైసిపి నాయకులు , కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

నాటక పోటీలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గూడూరు టౌన్ : గూడూరు సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 17 వరకు డీఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆటోరియంలో నాటక పోటీలు జరుగుతాయని కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని నాటక విభాగ కన్వీనర్ జానా శివయ్య పేర్కొన్నారు. గత 70 సంవత్సరాలుగా ఏటా నాటక పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్తమ నాటికలను ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో సోమిశెట్టి చెంచురామయ్య, మునిగిరీష్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని త్యాగరాజా వీధిలో ఉన్న ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ చదలవాడ హరి ప్రసాద్ దాతత్వంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ పదో తరగతిలో ఉత్తీర్ణులైన బలిజ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలిపారు. ఉత్తీర్ణులైన వారు వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఉన్న సునీత సేవా సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో మదనమేటి రమణయ్య, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయంగా గిరిజనుల భూపోరాటం



ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని ఎగువ కానూరు గిరిజన కాలనీలో సోమవారం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ముకుంద గిరిజనుల సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా గిరిజన కుటుంబాలు వారి సమస్యలను ఆయన దష్టికి తీసుకొచ్చారు. గత 20 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పొలాలను సాగు చేసుకోకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుపడుతున్నారని, అయినా సాగు చేస్తూ భూ పోరాటం చేస్తూనే ఉన్నామన్నారు. అందరికీ పట్టాలు ఇస్తూ తమకు మాత్రమే ప్రభుత్వ అధికారులు అన్యాయం చేశారని, ఫారెస్ట్ అధికారులు నిరంతరం అడ్డుపడుతున్నారని వాపోయారు. సమస్యలను అధికారుల దష్టికి తీసుకెళ్లి సత్వరం న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని ఆయన తెలిపారు.

స్పందన వినతులకు సత్వర పరిష్కారం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రతి సోమవారం విధిగా నిర్వహించే స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రజా వినతులను సత్వరం పరిష్కరిస్తున్నట్లు శ్రీకాళహస్తి ఆర్డీవో కె.ఎస్ రామారావు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో 25 వినతులు ఆర్డీవో కు వచ్చాయి. ఆ వినతులపై సత్వరమే స్పందించిన ఆర్డీవో సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారమయ్యేలా చొరవ చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం, అధికారులు ఉన్నారని చెప్పారు. ప్రజా సమస్యలు పరిష్కరిం చలేనప్పుడు తాము తీసుకుంటున్న వేతనాలకు విలువ లేదన్నారు. ప్రతి అధికారి ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారి సమస్యలకు సత్వరమే పరిష్కారం లభించేలా చర్యలు చూపాలన్నారు. ముఖ్యంగా వేసవిలో కురుస్తున్న అకాల వర్షాలకు పిడుగులు పడి ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, వారందరికీ జీవిత బీమా సౌకర్యం కల్పించాల్సిన అవసరం అధికారులపై ఉందన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉన్న ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ రెండు పథకాలకు చెల్లించాల్సిన రుసుం ఏడాదికి కేవలం రూ.20 లేనని, అది కూడా వారి బ్యాంకు ఖాతా కింద ఆటో డెబిట్ కింద జమ చేసుకోవడం జరుగుతుందని చెప్పారు. 18 నుంచి 70 సంవత్సరాల లోపు వారు ఈ బీమా పథకానికి అర్హులని, ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.2 లక్షలు పరిహారం అందుతుందని తెలిపారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పాలసీలో ఏటా రూ.436 చెల్లిస్తే అంగ వైకల్య బీమా కూడా వర్తిస్తుందని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమేరకు ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశామనీ, సచివాలయ ఉద్యోగులతో పాటు వాలంటీర్లు కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.



చెరువులో వ్యర్థాలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామంలో 800 ఎకరాలకు సాగునీరు అందించే చెరువులో పోర్టు నుంచి వ్యర్థాలు తెచ్చి కలుపుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గూడూర్ డివిజన్ రైతు సంఘం కార్యదర్శి జోగి శివకుమార్, వ్యవసాయ మండల కార్మిక సంఘం కార్యదర్శి ఎస్. ముత్యాలయ్య, సోమవారం స్పందన కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో ఎం.కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. చెరువులో నీరు కలుషితమై రంగు మారిపోవడంతో ఆ నీటిని తాగుతున్న నోరులేని మూగజీవాలు, బర్రెలు, ఆవులు, మేకలు అనారోగ్యంతో చనిపోతున్నాయని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా ఆటో కార్మిక సంఘం నాయకులు బి.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు

ప్రజాశక్తి-చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాలు ఈనెల 10 నుంచి 12 వరకు జరుగనున్నాయి. 11న సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు స్వర్ణ రథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవర్లను ఆలయంలోని వసంత మండపానికి వేంచేపు చేసి రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ, వీధి ఉత్సవం నిర్వహిస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకష్ణస్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపుగా తీసుకొచ్చి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారు. వసంత రుతువులో లభించే పుష్పాలు, ఫలాలను సమర్పించి స్వామివారి దివ్యానుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవం అంతరార్థం అని అర్చకులు తెలిపారు.

పేదలకు అన్నదానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి, ఆయన సోదరుడు బొజ్జల హరినాథ్ రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని టిడిపి మహిళా విభాగం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలు చక్రాల ఉష ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నారద పుష్కరిణి వద్ద పేదలకు అన్నదానం చేశారు. మాజీ మంత్రి గోపాలకష్ణారెడ్డి అజాతశత్రువు అనీ, ఆయన హయాంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం అన్ని విధాల అభివద్ధి చెందిందనీ, ఆయన లేని లోటు తీర్చలేదని ఉషా అన్నారు. గోపాల కష్ణారెడ్డి ఆశయాల సాధన కోసం టిడిపి కార్యకర్తలు పాటుపడాలని పిలుపునిచ్చారు. అంతకుముందు గోపాలకష్ణారెడ్డి, హరినాథ్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఉపాధ్యాయుల కృషితోనే ఉత్తమ ఫలితాలు



ప్రజాశక్తి-బాలాయపల్లి: ఉపాధ్యాయులు కృషితో ఉత్తమ ఫలితాలు వచ్చాయని ఉప సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని పిగిలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న జ్ఞానాన్ని వెలికి తీసి మండలం మొదట స్థానం వచ్చేలా కషిచేసిన ఉపాధ్యాయులకు పిగిలాం గ్రామం తరపున రుణపడి ఉంటామన్నారు. అనంతరం ప్రధానో పాధ్యాయుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు ఎంతగానో సహకారం అందించారన్నారు. ప్రమోద్ 547, శ్రీనాథ్ 513, స్ఫూర్తి 511 మార్కులు సాధించారన్నారు. అనంతరం మండలం మొదటి స్థానం మార్కులు దక్కించుకున్న పి.ప్రమోద్‌ను, పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తతీయ, మార్కులు సాధించిన విద్యార్థులను ఉప సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ధ్రువితారెడ్డికి కలెక్టర్ అభినందనలు



పజాశక్తి-తిరుపతి టౌన్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొండమనాడులో పదో తరగతి చదివి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో కంటే అత్యుత్తమ మార్కులు సాధించిన కుమారి సి.ధ్రువితారెడ్డిని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అభినందించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లో 589 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు జిల్లా కలెక్టర్ అభినందించారు. బి.ఎన్ కండ్రిగలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న డాక్టర్ సి రమేష్ రెడ్డిని తన కుమార్తెను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినందుకు కలెక్టర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.శేఖర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సురేష్ పాల్గొన్నారు.

వైసీపీతోనే నిరుపేదల అభివృద్ధి సాధ్యం



ప్రజాశక్తి-సత్యవేడు: వైసీపీతోనే నిరుపేదల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం సత్యవేడులోని గంగమిట్ట, వంశీ ప్రియ వీధి, మునసపు సందు, గౌండ్ల వీధి, కాలమ్మ గుడి వీధి, నేతాజీ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు అక్కడికక్కడే అధికారులకు సూచించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా ఆరా తీశారు. ఇంజినీరింగ్ చదువుకున్న అబ్బాయి నవీన్ దురదష్టవశాత్తు ప్రమాదానికి గురి కావడంతో మంచం పట్టి పూర్తిగా అంగవైకల్యంగా మారాడని..తల్లి సావిత్రి తమ గోడును ఎమ్మెల్యేకు విన్నవించింది. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత గ్రామ సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్‌రెడ్డి, జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్‌రెడ్డి, సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ బాలాజీ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ సోమశేఖర్, అధికారులు , సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



ప్రజాశక్తి-పాకాల: బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తోందని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ అన్నారు. ఆయన సోమవారం పాకాలలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల12, 13 తేదీల్లో జిల్లాలో ప్రిన్సిపల్ సెక్రటరీ సందర్శించడం జరుగుతుందని తెలిపారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. పరీక్షల ఫలితాలు తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. జగనన్న విద్యా కానుక ప్రతి విద్యార్థికి అందేలా చూడాలన్నారు. నాడు-నేడు పనులను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బాబ్జి, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వేసవిలో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో తిరుమలరాజు తెలిపారు. సోమవారం పుత్తూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపు గ్రంథాలయ అధికారి మీనాకుమారి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో తిరుమలరాజు, ప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.



సత్యవేడు: గ్రంథాలయంలో విద్యార్థులు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రతిమ సూచించారు. సత్యవేడు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో రవి, వైసిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ భూపంపిణీలో న్యాయం



ప్రజాశక్తి-గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అసైన్‌మెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, స్వచ్ఛ ఆంధ్ర సంస్థ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ, ఆర్డీవో కిరణ్ కుమార్‌తో పలు అంశాలు, సమస్యలపై చర్చించారు. ప్రధానంగా భూ పంపిణీపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదలకు భూ పంపిణీ చేస్తున్నారన్నారు. పేదలు సాగుచేసుకుంటున్న భూములు గుర్తించి వారికే చెందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నాయకులు రమేష్ రెడ్డి, గోపాల్‌యాదవ్, సాయి, జమళ్ళ వాసు, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మున్సిపల్ స్టాండింగ్ కమిటీ ఆమోదం



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటి ఆమోదం తెలిపినట్లు తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన స్టాండింగ్ కమిటి సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత , స్టాండింగ్ కమిటి సభ్యులు, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, స్టాండింగ్ కమిటి సభ్యులు ఎస్.కె.బాబు, నరసింహాచారి, ఉమాఅజయ్ పాల్గొని అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడం జరిగింది. సమావేశంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరేంద్రనాథ్, మునిరామిరెడ్డి, అదనపు కమిషనర్ సునీత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మ, సెక్రటరీ రాధిక, ఏసిపిలు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



ప్రజాశక్తి-బాలాయపల్లి: వెంకటగిరి-గూడూరు రోడ్డు మార్గం రామాపురం రోడ్డు మలుపు వద్ద మోటార్ సైకిల్‌ను తిరుపతి నుంచి నెల్లూరు జిల్లా కోవూరుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న టాటా ఏసీ వాహనం ఢీకొంది. ప్రమాదంలో వాక్యాం గ్రామానికి చెందిన కుమ్మి చంద్ర(15) మృతి చెందాడు. పోలీసులు కథనం మేరకు.. బాలాయపల్లి మండలం వాక్యాం గ్రామానికి చెందిన చెంచుబాబు, అన్నపూర్ణ రెండో కుమారుడు చంద్ర బాలాయపల్లికి వరుసగా అన్నతో ద్విచక్రవాహనంపై రామాపురం రోడ్డు మలుపు వద్ద తిరుగుతుండగా టాటా ఏసీ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడంతో పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో రాజేష్ గిరిస్వామి...



ప్రజాశక్తి-రేణిగుంట: గురవరాజుపల్లి వద్ద సోమవారం రాత్రి తమిళనాడు ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న మహాదేవ ఆశ్రమం స్వామి రాజేష్‌గిరి స్వామిని ఢీకొంది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ పాలనలో ప్రజలకు కష్టాలు



ప్రజాశక్తి-పిచ్చాటూరు: వైసీపీ పాలనలో ప్రజలకు ఆర్థిక కష్టాలు ఎక్కువయ్యాయని.. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి హెలెన్, మాజీ ఎమ్మెల్యే హేమలత అన్నారు. మండలంలోని శివగిరి పంచాయతీలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇలంగోవన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధానాలతో నిరుద్యోగ యువత, రైతులు, దళిత, గిరిజన వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని విమర్శించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్ నాయుడు, పద్దురాజు, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి నాయుడు, పద్మనాభనాయుడు, గంధమనేని రవీంద్ర, జయచంద్రనాయుడు, సురేష్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెస్ పోటీలతో ఏకాగ్రత సాధ్యం



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: చెస్ విద్యార్థులలో ఏకాగ్రత, మేధాశక్తిని అలవర్చుకోవచ్చని జిల్లా చెస్ అసోసియేషన్ ఛైర్మన్ డాలర్స్ గ్రూప్ అఫ్ ఛైర్మన్, డాక్టర్ సీ. దివాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం యూత్ హాస్టల్ లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలను చెస్ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ దివాకర్ రెడ్డి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ప్రతిఒక్కరూ చిన్నప్పటి నుండి క్రీడలను నేర్చుకోవాలని కోరారు. అనంతరం క్రీడాకారులతో కలసి ఆయన చెస్ ఆడారు మొదటి నాలుగు స్థానాలు సాధించిన మెన్ అండ్ విమెన్ క్రీడాకారులకు జిల్లా స్థాయి తరపున రాష్ట్ర స్థాయి పోటీలు మహిళలకు తిరుపతిలో ఈ నెల 26 నుండి 29 వరకు యూత్ హాస్టల్ లో జరుగుతాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస సూరి తెలిపారు. మహిళల రాష్ట్ర స్థాయిచెస్ ఛాంపియన్ షిప్ విజయవాడ లో ఈ నెల 18 నుండి 21 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమం లో రాష్ట్ర అధ్యక్షులు కే వీవి శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, చీఫ్ అర్బిటర్ బాలాజీ చౌదరి, అనిల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే

ఓపెన్ కేటగిరిలో విజేతలుగా నిలిచిన వారిలో యతిన్ రెడ్డి, త్రిపురాంబికా, లతీష్ రెడ్డి, పార్ధ సాయి, మహిళల విభాగంలో మోడీత రెడ్డి, మాన్సీ, శ్రీ మహాలక్ష్మి, గురువాక్షిని ఎంపికయ్యారు.